క్లుప్తంగా

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

సాక్షి, భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ స్థానిక ఎలక్ట్రికల్ డీఈ ఆఫీస్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. కేంద్రం సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణ అమలు చేయడం ద్వారా ప్రజలపై భారాల పడుతున్నాయని విమర్శించారు. సామాన్య ప్రజలు నడ్డి విరిచే విధంగా పెంచిన విద్యుత్ వినియోగ చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, బొక్కా సత్యనారాయణ, కలిపిండి సత్యనారాయణ, సీతారాం ప్రసాదు, ఎం.లక్ష్మీపతి రాజు, త్రిమూర్తులు, వెంకటపతి రాజు, డి.శ్రీను పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ



శాకంబరి అలంకరణలో కనకదుర్గమ్మ

కాళ్ల: కాళ్ల మండలం కోమటిగుంట కనకదుర్గమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా కోదండ రామాలయం కమిటీ, దాతలు సహకారంతో అమ్మవారిని సుమారు 200 కేజీల పలు రకాల కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రక్షిత నీటి సరఫరాకు చర్యలు



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఆరు రక్షిత మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు సురక్షితమైన నీటి సరఫరాకు చర్యలు చేపట్టామని చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. పలు అంశాల్ని కౌన్సిల్ సభ్యులు చర్చించారు. అజెండాలోని వాటర్ ప్లాంట్లలో క్లోరినేషన్‌కు రూ.7.40 లక్షలతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు, ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్పిడికి, ట్రాక్టర్ల అద్దె చెల్లింపునకు, వీధిలైట్ల ఏర్పాటు తదితర అంశాల్ని ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ జి.కృష్ణమోహన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ అందించిన పూర్వ విద్యార్థులు

ఉండి: మండలంలోని యండగండి ప్రభుత్వ పాఠశాలకు 1978–79 పదో తరగతి పూర్తిచేసిన వి.విశ్వనాధరాజు, ఎం.రమణరాజు, వి.గోవిందరాజు, జి.ప్రసాద్‌రాజు రూ.50 వేల విలువ చేసే కంప్యూటర్‌ను అందజేశారు. దీనిని గ్రామ ఉపసర్పంచ్ జగ్గరాజు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామబాల సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి

పాలకొల్లు అర్బన్: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని 27వ వార్డులో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, అలాగే బ్రాడీపేటలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ సుందరీకరణ పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, చింతలపూడి వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు డీటీడీసీ బాబు, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, అడబాల వెంకటరమణ, ఉప్పె పండుబాబు, పాలపర్తి కృపనాథ్, ఇజ్జాడ చినబాబు, యలకల రంగ, గేదెల నరసింహరావు పాల్గొన్నారు.

కాపు నేస్తంతో ఆర్థిక పరిపుష్టి

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



చినకాపవరంలో వృద్ధురాలికి పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: కాపు కులస్తుల ఆర్థిక పరిపుష్టికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న నవరత్నాల పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆకివీడు మండలం చినకాపవరంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. కాపు నేస్తం పథకం ద్వారా గ్రామంలో అత్యధికంగా ఉన్న కాపులకు పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని చెప్పారు. అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ తదితర లబ్ధి చేకూరుతుందన్నారు. తమను ఆర్థికంగా ఆదుకున్న వారికి ఎప్పుడూ కాపు కాస్తారని పీవీఎల్ అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నిలబడ్డారని చెప్పారు. రైతులు, వెనుకబడిన తరగతుల ప్రజల కుటుంబాల్లో నవరత్నాలు వెలుగులు విరజిమ్ముతున్నాయని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తుంటే, ప్రతిపక్షాలకు గిట్టడంలేదని ఆరోపించారు. అవినీతికి తావులేని పరిపాలన జగన్‌కే సాధ్యమైందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల నేతలు, ఎల్లో పత్రికల దుష్టచతుష్టయంతో ప్రజల్ని మోసగించాలని చేస్తున్న కుట్రల్ని ప్రజలే తిప్పి కొడతారని తెలిపారు. రాష్ట్రంలో యువశక్తిని సద్వినియోగం చేసుకునేందుకు ఉపాధి అవకాశాల్ని మెండుగా కల్పిస్తున్నారని చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా మిగిలిన అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చనున్నట్టు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఏ పథకానికి అర్హులు, ఏ ధ్రువీకరణ పత్రం అందజేయాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు వివరాలు సేకరిస్తున్నారని చెప్పారు. పథకాలు అందుతున్న తీరు, పథకాలు అందాల్సిన లబ్ధిరుల వివరాల్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నటువంటి ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా లేరని పీవీఎల్ వివరించారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి, ఎంపీడీఓ కందుల వాణి, కేశిరెడ్డి మురళి, నంద్యాల సీతారామయ్య, మోటుపల్లి గంగాధరరావు, పుప్పాల పండు, కట్రెడ్డి మోహన్, కఠారి కేశవరావు, సుధాక ర్, పళ్లెం అరుణ కుమారి, మోరా జ్యోతి, గాలి సామ్రాజ్యం, అల్లూరి తమ్మిరాజు, నాతిరెడ్డి అన్నవరం, నందమూరి సత్యవతి, పోలిశెట్టి కనక దుర్గ, పెద్దింటి కళావతి, కత్తుల శ్రీను, వానపల్లి భాస్కరరావు, చిక్కాల చిన్నా, జవ్వాది సుబ్బయ్య, జామి శ్రీనివాస్, హుస్సేన్, అన్యెం కృష్ణ, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శి నారాయణరావు పాల్గొన్నారు.

నేడు చినకాపవరంలో రెండో రోజు..

ఆకివీడు మండలం చినకాపవరం గ్రామంలో రెండో రోజు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కందుల వాణి పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుతారని పేర్కొన్నారు.

నూరుశాతం వసూళ్లు అభినందనీయం



సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ ప్రసాదరాజుకు మెమెంటో అందిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 2022–23 సంవత్సరానికి సంబంధించి రైతుల నుంచి బకాయిలను పూర్తిగా వసూలు చేయడం అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కాళ్ల మండలం పెద అమిరం కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం బకాయిలు మొత్తం సుమారు రూ.6.40 కోట్లు వసూలు చేసి, తిరిగి సభ్యులకు రుణాలు మంజూరు చేసి, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. గత 13 ఏళ్లుగా జిల్లాలోని సొసైటీల కంటే ముందుగా రికవరీ చేసి ఆదర్శ సంఘంగా నిలవడంతో సీఈఓ కనుమూరి మణి, సొసైటీ ఉద్యోగులు, రైతులు, సంఘ సభ్యులను పీవీఎల్ అభినందించారు. ఈ సందర్భంగా సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పెనుమత్స దుర్గా ప్రసాదరాజును ఘనంగా సత్కరించి మెమెంటో ప్రదానం చేశారు.

మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా



మోగల్లులో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ కృష్ణారావు

పాలకోడేరు: ప్రభుత్వం నాడు – నేడు, మధ్యాహ్న భోజనం (జగనన్న గోరుముద్ద) పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన మోగల్లులోని పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 98 శాతం మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారని, 8, 9, 10 తరగతుల విద్యార్థులు తక్కువ శాతం తింటున్నారని చెప్పారు. వారానికి ఐదు కోడి గుడ్లు, ఆకుకూరలు, బిర్యాని, పులిహోర, అన్నం, పప్పు చారు, సాంబారులతో భోజనం పెడుతున్నారని, పౌష్టికాహార పదార్థాలయిన చిక్కిలు, రాగి జావ కూడా ఇస్తున్నారని, విద్యార్థులు భోజనం తినేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులతో పాటు భోజనం చేసి, ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి చెందారు. కోఆర్డినేటర్ వెంట ప్రధానోపాధ్యాయులు ఎంవీ త్రినాథులు, డి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

లయన్స్ 51వ ఆకివీడు కమిటీ ఏర్పాటు



ఆకివీడు లయన్స్ క్లబ్ 51వ కమిటీని ప్రకటించిన సూర్యనారాయణరాజు

ఆకివీడు: లయన్స్ క్లబ్ 51వ ఆకివీడు నూతన కమిటీని ఏర్పాటు చేసినట్టు జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు తెలిపారు. శుక్రవారం లయన్స్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జూలై 2న నూతన కమిటీ అధ్యక్షుడిగా వేగేశ్న వెంకట కృష్ణంరాజు, కార్యదర్శిగా దాట్ల రామరాజు, కోశాధికారిగా వి.చింతారావు ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతారని చెప్పారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున అందజేస్తామని, 25 మంది నిరుపేదలకు 10 కేజీల చొప్పున బియ్యం అందజేస్తామని తెలిపారు. మండలంలోని విద్యార్థులకు కావాలసిన ల్యాబ్ పరికరాల్ని తమ క్లబ్ అందజేస్తుందన్నారు. సమావేశంలో లయన్స్ ప్రతినిధులు గుర్రం శ్రీనివాస్, పిన్నమరాజు మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

చిలుకూరులో పైప్‌లైన్ పనులు ప్రారంభం



చిలుకూరులో మంచినీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటసోమరాజు

ఉండి: మండలంలోని చిలుకూరు గ్రామ ఎస్సీ కాలనీలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సహకారంతో గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు ఆధ్వర్యంలో పైపులైన్ పనులు శుక్రవారం ప్రారంభించారు. రూ.28.5 లక్షలు జల్‌జీవన్ మిషన్ నిధులతో గ్రామంలో అవసరమైన ప్రతి ప్రాంతానికీ పైపులైన్ ఏర్పాటుచేస్తామని సర్పంచ్ చెప్పారు. అనంతరం సుమారు 400 కుళాయి కనెక్షన్స్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ ఆధ్వర్యంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కూనపరాజు రామకృష్ణంరాజు,వార్డు సభ్యురాలు కుసుమే బేబి, గ్రామ కార్యదర్శి సాతీ్వకం తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



పౌరహక్కుల దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్

పోడూరు: ప్రతి నెలా 30వ తేదీన నిర్వహించే పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి మండల స్థాయిలో బాధ్యులైన అధికారులంతా హాజరుకావాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ ఆదేశించారు. పోడూరు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు ఆనందప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి చాలామంది ప్రభుత్వశాఖల అధికారుల గైర్హాజరు కావడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి అధికారులు గైర్హాజరుకావడంపై కమిషన్‌కు రిపోర్టు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దళితుల పరిరక్షణ కోసం రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకే ప్రతీనెలా మండలంలోని ఒక గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి, ఎంపీడీఓ డి.సుహాసిని, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్, మండలపరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

సాక్షి, భీమవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని టెంపుల్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీనివాస థియేటర్ సెంటర్, రైతు బజార్ ఏరియా, నాచువారి సెంటర్, జంక్షన్ రోడ్, ముస్లిం వీధి, ఫైర్ స్టేషన్ రోడ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. తాడేరు విద్యుత్ ఉపకేంద్రం నుంచి పెదగరువు ఉపకేంద్రం వెళ్లే లైన్ల నిర్వహణ నిమిత్తం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెదగరువు విద్యుత్ ఉపకేంద్రానికి విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. తాడేరు ఇండస్ట్రియల్ లైన్ తాడేరు, యమునేపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు దూసనపూడి, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, బాలేపల్లి గ్రామాలు, తుందుర్రు గోదావరి మెగా ఆక్వాఫుడ్ పార్క్‌నకు సరఫరా ఉండదని వివరించారు. రాయలం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు కొమరాడ రోడ్డు, గొరగనమూడి, కొమరాడ, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలు, అనాకోడేరు/కొమరాడ ఇండస్ట్రియల్ లైన్లకు, ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కొవ్వాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

భీమవరం అర్బన్: కొవ్వాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కొవ్వాడ, కొవ్వాడ అన్నవరం, కొవ్వాడ పుంత, నరసింహపురం గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు.

ఈ-ఆశ యాప్‌లో టెక్నికల్ సమస్యకు చెక్

పాలకోడేరు: గర్భిణులు, బాలింతలకు ఇచ్చిన టీటీ, ఐరన్ మాత్రలు, ఇమ్యునైజేషన్, వ్యాక్సిన్లు, మందులు, వైద్య పరీక్షలు తదితర వివరాల నమోదుకు సంబంధించిన ఆశ వర్కర్ల ఆండ్రాయిడ్ ఫోన్లలోని ఈఆశ యాప్‌లో శుక్రవారం టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో ఈ ఆశ యాప్‌కు సపోర్ట్‌గా ఎంకాష్ యాప్‌ను డౌన్లోడ్ చేసి సరి చేయించారు. ఇక నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆశలు, సర్వే వివరాలు నమోదు చేసుకోవచ్చని డీపీఎంఓ వెంకటరత్నం తెలిపారు. ఈ అనంతరం ఆశాలకు, ఏఎన్ఎంలకు పీహెచ్‌సీ వైద్యాధికారి రంగమనాయుడు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ అమ్మాజీ, సీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, వేదాకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూకాలమ్మ వెండి చీరకు విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీరాంపురం నూకాలమ్మవారికి వెండిచీర తయారీకి ఎస్ఆర్‌ఐ తమ్మిన శ్రీనివాస్, భవాని దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మెట్టా మురళీకృష్ణ, తాళ్లపూడి పరమేశ్వరరావు, రౌతు హరిబాబు, జమ్ము తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు మెమో

పాలకోడేరు: పసిబిడ్డకు వ్యాక్సిన్ వేసేందుకు నిరాకరించారంటూ వచ్చిన ఫిర్యాదుకు సంజాయిషీ ఇవ్వాలని ఏఎన్ఎం ఉషా సుందరి, ఆశా వర్కర్ నీలిమకు పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చినమిల్లి రంగమనాయుడు మెమో జారీ చేశారు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన ఎం.సత్యవతి అనే మహిళ ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బిడ్డకు బీసీజీ వ్యాక్సిన్ వేయాలని దగ్గరలో ఉన్న సబ్ సెంటర్లోని ఏఎన్ఎంను, ఆశ వర్కర్‌ను కోరగా తమ వద్ద లేదని, పాలకోడేరు వెళ్లి వేయించుకోండని దురుసుగా సమాధానమిచ్చారని పేర్కొంది. ఈ మేరకు సత్యవతి జగనన్నకు చెబుదాం యాప్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు మెమో జారీ చేశారు.

గడువులోపే విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఉండి: విద్యుత్ బిల్లులను గడువులోగా చెల్లిస్తే ఇబ్బందులు ఉండవని విద్యుత్ ఈఈ ఫీర్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సబ్‌స్టేషన్‌లో ఏఈలు, ఎల్ఐలు, లైన్‌మేన్లతో ఆయన శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. బిల్లుల చెల్లింపు విషయంలో చివరి తేదీ దాటితే ఏం జరుగుతుందనే విషయాన్ని వివరంగా వినియోగదారులకు తెలియచేయాలన్నారు. లైన్ల పనుల్లో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ కె.రాంబాబు, ఏఈలు ఎం మాధవరాజు, ప్రసాదరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం బార్ అధ్యక్షుడిగా దానయ్య నాయుడు

నరసాపురం రూరల్: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చల్లా దానయ్య నాయుడు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 147 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో చల్లా దానయ్యనాయుడుకు 117 ఓట్లు లభించగా ఆయన ప్రత్యర్థి తానుకొండ సంతోష్‌కుమారికి 29 ఓట్లు లభించాయి.

ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం రూరల్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ప్రశాంతంగా సాగింది. చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. భూపతివారి వీధి నుంచి అంబేద్కర్ కమ్యూనిటీ హాలు వరకూ 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు పిలిచిన టెండర్లలో 13.69 శాతం తక్కువకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతతో ఎలా పనిచేస్తారంటూ సఖినేటిపల్లి సురేష్, కేసరి రాజు తదితరులు అనుమానం వ్యక్తం చేశారు. నాణ్యత విషయంలో అధికారులు పర్యవేక్షణ ఖచ్చితంగా ఉంటుందని ఏఈ సునీల్‌కుమార్ వివరణ ఇచ్చారు. ఇదే విషయమై కౌన్సిలర్లు కోటిపల్లి సురేష్, కొత్తపల్లి నాని, తదితరులు మాట్లాడుతూ గతంలో కూడా అంతకంటే తక్కువ కోట్ చేసి పనులు దక్కించుకుని చేసిన నిర్మాణాలు సజావుగానే ఉన్నాయని పనుల నాణ్యత విషయంలో క్వాలిటీ కంట్రోల్ బోర్డు తనిఖీ ఉంటుందని అన్నారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో సిబ్బంది పనితీరుపై సభలో చర్చించారు. పట్టణంలోని వీధి దీపాల నిర్వహణకు ఆటోమెటిక్ ఆన్ ఆఫ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు అంచనాలు సిద్ధం చేశామని వచ్చే కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి ఎజెండాలో పొందుపరుస్తామని కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు వివరణ ఇచ్చారు. వేసవిలో తాగునీటి సరఫరా నిర్వహణ తదితర విషయాలపై చర్చించారు. సమావేశం చివర్లో ప్రతిపక్ష సభ్యులు ఒకరితో ఒకరు వాగ్వివాదానికి దిగి గందరగోళ పరిస్థితులు సృష్టించడంతో చైర్‌పర్సన్ సభను ముగించినట్లు ప్రకటించారు.